

పల్లెబాటా.. ముళ్లబాటా!
ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి చేపట్టిన పల్లెబాట కార్యక్రమంలో అడుగడుగునా ప్రజలు నిలదీస్తున్నారు. 8లో▸



విగ్రహ ప్రతిష్ఠాపన
తాండూరు రూరల్ మండలంలోని అల్లాపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. 8లో▸



రహదారులకు మహర్దశ
గ్రామీణ ప్రాంతాల్లోని మట్టి రోడ్లకు మహర్దశ పట్టనుంది. బీటీరోడ్లుగా మారి రవాణ సౌకర్యం మెరుగు పడనుంది. 9లో▸

న్యూస్‌రీల్

ఈ నెలాఖరు వరకు వడ్డీలేని పన్ను

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని ఆస్తిపన్నుల చెల్లింపుదారులు 2023–24 మొదటి అర్ధ సంవత్సరానికి ఎలాంటి వడ్డీ లేకుండా ఈ నెలాఖరు వరకు చెల్లించవచ్చని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 1 నుంచి బకాయి పన్నుపై నూటికి రూ.2 చొప్పున వడ్డీ పడుతుందన్నారు. మున్సిపాల్టీకి చెల్లించే ఆస్తి పన్ను, నల్లా పన్ను, ఖాళీ స్థలాలు, ఇతర పన్నులను ఈ నెల 30లోపు చెల్లించి పన్నుపై వడ్డీ మినహాయింపు పొందాలన్నారు. పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘాటెక్కిన మిర్చి
కిలో ధర రూ.120



మార్కెట్లో పచ్చి మిర్చి కొనుగోలు చేస్తున్న మహిళలు

ధారూరు: పచ్చిమిర్చి ధర అమాంతం పెరిగింది. శనివారం కూరగాయల మార్కెట్లో కిలో ధర రూ.120 పలికింది. అన్ని కూరగాయల ధరలు కిలో రూ.80 నుంచి రూ.100 వరకు ఉన్నాయి. ఒక్క బెండకాయ మాత్రం కిలో రూ.40లకే విక్రయించారు. గతవారం రూ. 500 తీసుకెళ్తే అన్ని రకాల కూరగాయలు లభ్యమయ్యేవని, ఈ వారం రూ.వెయ్యి వెచ్చించాల్సి వచ్చిందని మహిళలు పేర్కొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

వికారాబాద్ అర్బన్: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి అనేక సార్లు పోరాటం చేసినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వం తీరుకు నిరసనగా ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్, ఆర్డీఓ, మండల కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లాలో కూడా రిటైర్డ్ ఉద్యోగులు ఆయా మండలాల తహసీల్దార్లకు, ఆర్డీఓలకు వినతిపత్రాలు ఇవ్వాలన్నారు. జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉన్న ఉద్యోగులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

జిప్సం ఫ్యాక్టరీపై ఫిర్యాదు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గుంతబాసుపల్లి శివారులో ఉన్న జిప్సం ఫ్యాక్టరీపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చిన్నప్పల నాయుడికి దస్తయ్యగౌడ్, జఫర్ పటేల్, కాశప్పలు ఫిర్యాదు పత్రం అందజేశారు. జిప్సం ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని అవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం వల్ల ప్రజలు ఊరు వదిలి వెళ్తున్నారని మొరపెట్టుకున్నారు. మంగళవారం రెవెన్యూ ఆర్‌ఐను పంపించి విచారణ చేయిస్తానని తహసీల్దార్ ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

వృద్ధాశ్రమం సందర్శన



ఆశ్రమంలో న్యాయవాదులు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మహిమా మినిస్ట్రీస్ వృద్ధాశ్రమాన్ని శనివారం చీఫ్ లీగల్ ఏయిడ్ డిఫెన్స్ న్యాయవాది వెంకటేశ్, డిప్యూటీ లీగల్ ఏయిడ్ డిఫెన్స్ రాము సందర్శించారు. ఆశ్రమంలోని వృద్ధులకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. అనాథ వృద్ధులు ఉన్నారని, వారికి సంబంధించిన వారు ఎవరు లేరని, వారిలో చాలా మంది దివ్యాంగులుగా ఉన్నారని ఆశ్రమ కోఆర్డినేటర్ వారికి వివరించారు. వృద్ధులతో మాట్లాడి అందుతున్న సదుపాయాల గురించి వారు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ కోఆర్డినేటర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



పూడూరు: విత్తనాలు వేస్తున్న మహిళలు

తొలకరి కురిసె రైతు మురిసె

తొలకరి పలకరించడంతో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. కొందరు హలం పట్టి భూములు చదును చేస్తుండగా.. మరికొందరు విత్తనాలు వేస్తున్నారు. కొనిచోట్ల రైతులే కాడెద్దులుగా మారి పొలం పనులు చేపదుతున్నారు. పత్తి, కంది, పెసర, మినుము, మొక్కజొన్న పంటలు సాగు వేసేందుకు మొగ్గుచూపుతున్నారు. శనివారం పెద్దేముల్, తాండూరు, పూడూరు మండలాల్లో రైతులు వివిధ పనులు చేస్తూ కనిపించారు.

– తాండూరు రూరల్/పెద్దేముల్/పూడూరు



పెద్దేముల్ లో విత్తనాలు వేస్తూ..

బదిలీలకు వేళాయే..

ప్రారంభమైన ఎన్నికల కసరత్తు
- ఇప్పటికే సూచించిన కేంద్ర ఎన్నికల కమిషన్
- పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలే కీలకం



వికారాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బదిలీలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ సైతం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కలెక్టర్, ఎస్పీ సమావేశాలు నిర్వహించి ఎన్నికల కసరత్తు ప్రారంభించాలని సూచించింది. ఓటరు జాబితాలో తప్పొప్పుల సవరణ, ఈవీఎంల పరిశీలన తదితర అంశాలపై ఇప్పటికే దృష్టి సారించిన అధికారులు బదిలీల ప్రక్రియపై దృష్టిసారిస్తున్నారు. ఇందుకోసం శాఖల వారీగా ఎవరెవరిని బదిలీ చేయాలనే విషయమై జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికలతో నేరుగా సంబంధం ఉండే రెవెన్యూ, పోలీసు శాఖలతో పాటు పరోక్షంగా సంబంధం ఉన్న మండల పరిషత్ ఎంపీడీఓలను సైతం బదిలీ చేశారు. అయితే ఇటీవల ఆయా జిల్లాల ఎంపీడీఓలు తమకు నేరుగా ఎన్నికల విధులతో సంబంధం లేనందున బదిలీల నుంచి మినహాయించాలని కలెక్టర్లకు విన్నవించగా ఇప్పటి వరకు పది జిల్లాల్లో బదిలీల నుంచి వారిని మినహాయించారు. మన జిల్లాలో కూడా ఎంపీడీఓలకు మినహాయింపు ఇచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు శాఖలలో బదిలీలకు చర్యలు ముమ్మరం చేశారు.

రెవెన్యూ శాఖలో..
రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న మెజారిటీ అధికారులు బదిలీ కానున్నారు. కలెక్టర్ ఇటీవలే జిల్లాకు బదిలీపై వచ్చిన నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు మొదలుకుని స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు ఆయనే కొనసాగనున్నారు. జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు ఉండగా వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి ఏడాదిన్నరగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె బదిలీ అయ్యే అవకాశం లేదు. ఇక తాండూరు ఆర్డీఓగా, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా విధులు నిర్వహిస్తున్న అశోక్‌కుమార్ ఇప్పటికే జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆయన బదిలీ అనివార్యం కానుంది. బొంరాస్‌పేట, పరిగి, బషీరాబాద్, దారూరు తహసీల్దార్లు వచ్చి ఇంకా మూడేళ్లు కానందున వీరు బదిలీ అయ్యే అవకాశం లేదు. పూడూరు, వికారాబాద్, కుల్కచర్లలో తహసీల్దార్లు లేకపోవటంతో ప్రస్తుతం డీటీలే ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. ఈ మండలాలకు కొత్త తహసీల్దార్లు వచ్చే అవకాశం ఉంది. ఇక జిల్లాలో ఇప్పటికే మూడేళ్ల సర్వీస్ పూర్తి కావటంతో పాటు జిల్లా వాస్తవ్యులైన తహసీల్దార్లను బదిలీ చేసేందుకు జాబితా సిద్ధమైంది. నవాబుపేట, తాండూరు, మోమిన్‌పేట, మర్పల్లి, కోట్‌పల్లి, బంట్వారం, పెద్దేముల్, దోమ, యాలాల, కొడంగల్, దుద్యాల, చౌడాపూర్, దౌల్తాబాద్ తహసీల్దార్ల బదిలీ అనివార్యం కానుంది.

పోలీసు శాఖలోనూ..
కేంద్ర ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనల మేరకు జిల్లాలో పోలీసు అధికారులను సైతం బదిలీ చేయనున్నారు. వారిచ్చిన కటాఫ్ తేదీ ప్రకారం జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న పోలీసు బాస్‌లను అందరిని బదిలీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. వికారాబాద్, తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్లు, వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్, దారూరు, మోమిన్‌పేట్, పరిగి, తాండూరు రూరల్, కొడంగల్ సర్కిళ్లు, డీసీఆర్బీ, సీసీఎస్, ఎస్బీలకు ఇనిస్పెక్టర్లు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇందులో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న మోమిన్‌పేట, వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్, డీసీఆర్‌బీ, సీసీఎస్, ఎస్‌బీ, డీటీసీ సీఐలు బదిలీ కానున్నారు. వికారాబాద్ డీఎస్పీ పదోన్నతి పొందిన నేపథ్యంలో ఆయన కూడా బదిలీ కానున్నారు. అడిషనల్‌ఎస్పీ, ఎస్పీ, తాండూరు డీఎస్పీ ఇంకా జిల్లాకు వచ్చి మూడేళ్లు కానందున వారు బదిలీ అయ్యే అవకాశం లేదు. ఇక ఎస్‌ఐలలో పరిగి, పెద్దేముల్ పోలీస్ స్టేషన్ల ఎస్‌ఐలు బదిలీ అయ్యే అవకాశం ఉంది.

వీఆర్‌ఏ బరితెగింపు

- దర్జాగా అసైన్డ్ భూమి కబ్జా
- రెండు ఎకరాలు ఆక్రమించిన ఎక్మాయి వీఆర్‌ఏ
- భారీగా చెట్లు నరికి పంటల సాగు
- పక్క రైతులకు దారిలేకుండా దౌర్జన్యం
- సర్వేలో గుర్తించిన రెవెన్యూ అధికారులు
- చర్యలు తీసుకుంటామన్న తహసీల్దార్



కబ్జా చేసిన భూమిలో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

బషీరాబాద్: కంచె చేను మేసిన చందంగా సర్కారు భూమిని కాపాడాల్సిన ఓ రెవెన్యూ వీఆర్‌ఏ రెండు ఎకరాల భూమిని కబ్జా చేశారు. ఈ ఘటన బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామంలో వెలుగు చూసింది. గ్రామంలో సర్వే నంబర్ 111లో 133 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. పక్కనే చిన్న నది ఉంది. ఈ భూములను ప్రభుత్వం గతంలో పేదలకు లావణి పట్టాలుగా పంపిణీ చేసింది. గ్రామానికి చెందిన వీఆర్‌ఏ సులెగాం హన్మంతు తల్లి పేరున ప్రభుత్వం గతంలో 2 ఎకరాల ప్రభుత్వ భూమి ఇచ్చింది. అలాగే వీరి దాయాది అయిన సులెగాం అంతప్పకూ 4 ఎకరాల అసైన్డ్ భూమి ప్రభుత్వం ఇచ్చింది. చాలా కాలంగా సాగు చేస్తూ వస్తున్నారు. అంతప్ప చనిపోయిన తరువాత కొంత కాలానికి ఆయన ఇద్దరు కుమారులు కూడా చనిపోయారు. వ్యవసాయం చేసే వారులేక ఏడాది పాటు పంట సాగు చేయలేదు. దీంతో ఆ భూమిపై దాయాది అయిన వీఆర్‌ఏ హన్మంతు కుటుంబం కన్నుపడింది. ఆ భూమిని కబ్జా చేసి పంటలుసాగు చేస్తున్నారు. తన తల్లి బసమ్మ పేరున ఉన్న రెండు ఎకరాల భూమి ఇదే అంటూ నాలుగు ఎకరాల భూమిని ఆక్రమించుకొని దర్జాగా సాగు చేస్తున్నారు. అంతేకాకుండా నదీ పక్కన పొలాలకువెళ్లే దారిని కూడా దున్నేశారు. నదీ పరీవాహకంగా ఉన్న పెద్ద చెట్లను నరికి పంట సాగు చేస్తున్నారు.

అధికారుల సర్వేతో బట్టబయలు
తమ భూములకు వెళ్లేందుకు సర్వేనంబర్ 111లో గతంలో బాట ఉండేదని ఇప్పుడు ఆ దారిని సులెగాం బసమ్మ దారిలేకుండా చేశారని గ్రామానికి చెందిన కృష్ణయ్య, గోపాల్, బసప్ప, నర్సమ్మ, భీమ్మమ్మ, అబిబ్ రహీం, దస్తయ్య అనే రైతులు ఈ నెల 17న తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై శనివారం ఆర్‌ఐ రాకేశ్, మండల సర్వేయర్ ప్రభు 111 సర్వేనంబర్ భూముల్లో సర్వే చేశారు. ఈ సర్వేలో వీఆర్‌ఏ హన్మంతు కుటుంబం వారికి ప్రభుత్వం ఇచ్చిన 2 ఎకరాల భూమితో పాటు మరో రెండు ఎకరాలు ఆక్రమించుకొని సాగు చేస్తున్నట్లు వెలుగుచూసింది. సర్వే చేస్తున్న అధికారులను సైతం వీఆర్‌ఏ కుటుంబం అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. ఈ మేరకు తహసీల్దార్ వెంకట స్వామికి సర్వే నివేదిక అందజేశారు.

మా భూమిని ఆక్రమించారు
ఇదిలా ఉండగా ప్రభుత్వం తమకు ఇచ్చిన భూమిని వీఆర్‌ఏ కుటుంబం క్రమించిందని అదే గ్రామానికి చెందిన సులెగాం క్షమాంతమ్మ అనే మహిళ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తన మామ సులెగాం అంతప్ప పేరున నాలుగు ఎకరాల భూమి ఇస్తే సులెగాం బసమ్మ కబ్జా చేసుకొని సాగు చేస్తున్నారని రాతపూర్వక ఫిర్యాదు చేశారు. ధరణిలోనూ తమ పేరు మీదనే భూమి ఉందని చెప్పారు. మరోవైపు సర్వేలోనూ ఇదే విషయం బయట పడడంతో వీఆర్‌ఏ హన్మంతుకు తహసీల్దార్ వార్నింగ్ ఇచ్చారు. వెంటనే ఆ భూమిని ఖాళీ చేయకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. దీనిపై మరో సారి సమగ్రంగా సర్వేచేయాలని ఆర్‌ఐకి ఆదేశించారు.

డివైడర్ ఎక్కి.. ఆపై లారీని ఢీకొట్టి

- అదుపుతప్పిన బొలేరో
- ముగ్గురు యువకుల దుర్మరణం
- హైదరాబాద్‌లో గొర్రెలు అమ్మి వస్తుండగా ప్రమాదం
- షాద్‌నగర్ శివారులో ఘటన



అశోక్



రవి నాయక్



శంకర్ నాయక్



ప్రమాదంలో దెబ్బతిన్న బొలేరో వాహనం

షాద్‌నగర్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. హైదరాబాద్‌లో గొర్రెలు విక్రయించి తిరిగి వస్తుండగా.. వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి డివైడర్, ఆ తర్వాత లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటన శనివారం ఉదయం షాద్‌నగర్ శివారులోని అన్నారం వై జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం మందాపూర్‌కు చెందిన అశోక్ (28) బొలేరో వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నార్యా నాయక్ తండాకు చెందిన రవినాయక్ (25), వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి తండాకు చెందిన శంకర్‌నాయక్ (30) మేస్త్రి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదనపు ఆదాయం కోసం వారు గొర్రెల వ్యాపారం కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం బొలేరో వాహనంలో గొర్రెలను తీసుకొని హైదరాబాద్ వెళ్లారు. తిరిగి శనివారం ఉదయం వనపర్తి జిల్లా పెబ్బేరు సంతలో గొర్రెలను కొనుగోలు చేసేందుకు అదే వాహనంలో హైదరాబాద్ నుంచి బయలుదేరారు. మార్గమధ్యలో షాద్‌నగర్ శివారులోని అన్నారం వై జంక్షన్ వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి.. డివైడర్ ఎక్కి పక్క వరుసలో జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరోలో ఉన్న పై ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహాలను.. సీఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐ విజయ్‌కుమార్ బయటికి తీసి షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన తీరుకు సంబంధించిన సీసీ ఫుటేజీ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లుకొడుతోంది.

మిన్నంటిన రోదనలు
రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడ్డారనే విషయం తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు షాద్‌నగర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

సంతాపం తెలిపిన మంత్రి నిరంజన్‌రెడ్డి
కన్హాశాంతి వనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రమాద ఘటనపై సంతాపం వ్యక్తం చేశారు.

నిజాయితీ చాటిన అంబులెన్స్ సిబ్బంది
రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందజేశారు. ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి అంబులెన్స్ సిబ్బంది మృతదేహాలను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. మృతదేహాలను బొలేరో వాహనం నుంచి బయటికి తీస్తున్న క్రమంలో వాహనంలో రూ.1.92 లక్షలతో పాటు సెల్‌ఫోన్‌ను గుర్తించారు. వాటిని స్థానిక పోలీసులకు అందజేశారు. అంబులెన్స్ సిబ్బంది నిజాయితీని పలువురు అభినందించారు.

ఎరువులు, విత్తనాల జాడేది?

- సాగుకు సిద్ధమైన రైతులు
- మార్కెట్లో అధిక ధరలకు విక్రయాలు



పెద్దేముల్‌లో తెరుచుకోని ఎరువుల కేంద్రం

పెద్దేముల్: రైతన్నలు వానాకాలం సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పంటపొలాలను శుద్ధిచేసి వరుణుడి కోసం ఎదురు చూస్తున్నారు. చినుకు పడితే విత్తనాలు విత్తేందుకు రెడీగా ఉన్నారు. కానీ ఇప్పటి వరకు పెద్దేముల్ మండలంలో విత్తనాలు, ఎరువుల జాడలేదు. చేసేదిలేక రైతులు మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు సాగుపై రైతులకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయడంలేదు. అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలు నేడు రైతులకు అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. నకిలీ విత్తనాల బారిన రైతులు పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి ఏటా నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ఎరువుల దుకాణాలపై దాడులు జరుగుతున్నా, నకిలీ దందా ఆగడం లేదు. వారం రోజుల క్రితం డీఏపీ 50 కిలోల ఎరువు బస్తా రూ.1350 బదులు రూ.1600లకు పైగా విక్రయిస్తున్నారని రైతులు జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్‌కు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేదని రైతులు చెబుతున్నారు. రూ.850 విక్రయించాల్సిన పత్తి ప్యాకెట్లు రూ.1200 నుంచి రూ.1300 వరకు అమ్ముతున్నారు. ధర అడిగితే బిల్లులు ఇవ్వడం లేదు. గతంలో ఆగ్రోస్, రైతు సేవా సహకార సంఘం ద్వారా ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేవి. ఆగ్రోస్ జాడా లేకుండా పోయింది. రైతు సేవా సంఘం వారు తీసుకురావడం లేదు. దీంతో రైతులు ఎరువులు, విత్తనాల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులు స్పందించి మండల కేంద్రంలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. రెండేళ్లుగా అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతినడంతో పెట్టుబడులు సైతం రాని దుస్థితి ఏర్పడిందని, 50శాతం సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

2వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
మండలంలో ఏటా రెండు వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, యూరియా, పొటాష్ ఎరువులు అవసరం ఉంటుందని మండల వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మండలంలోని 30 రెవెన్యూ గ్రామాల్లో వానాకాలం సాగు 24,751 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. అందుకు సుమారు డీఏపీ–780మెట్రిక్ టన్నులు, యూరియ–1815ల మెట్రిక్ టన్నులు, పొటాష్– 400లు, కాంప్లెక్స్–500 మెట్రిక్ టన్నులు అవసరం ఉందని ఏఓ నజీరొద్దీన్ తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువులు, పత్తి విత్తన ప్యాకెట్లు అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాదారులపై చర్యలు తీసుకుంటాం. రైతులకు తప్పకుండా రశీదులు ఇవ్వాలి. బిల్లు ఇవ్వకుంటే, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే రైతులు సమాచారం అందించాలి.

– నజీరొద్దీన్, ఏఓ, పెద్దేముల్

విత్తనాల కోసం పడిగాపులు



ఐనెల్లి రైతువేదిక వద్ద రైతుల నిరీక్షణ

తాండూరు రూరల్: ఐనెల్లి రైతు వేదిక వద్ద విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాశారు. జాతీయ ఆహార భద్రత పథకం కింద ఉచిత కంది, మినుము విత్తనాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 10 గంటలకే రైతులు పెద్ద సంఖ్యలో రైతు వేదికకు చేరుకున్నారు. ఏఈఓ రాకపోవడంతో సుమారు రెండు గంటల పాటు పడిగాపులు కాశారు. తీరా వచ్చినా ఒక్కో రైతుకు కేవలం 4 కిలోల విత్తనాలే అందించారు.

నల్లబెల్లం స్వాధీనం

ఇబ్రహీంపట్నం: సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పటికను ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం మేరకు.. మాల్ గ్రామానికి చెందిన రవి హైదరాబాద్ నుంచి సొంత ఊరికి వ్యాన్‌లో బెల్లం, పట్టిక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఇబ్రహీంపట్నం చెరువు కట్ట వద్ద 500కిలోల నల్లబెల్లం, 15వేల విలువ చేసే పటికను స్వాధీనం చేసుకున్నారు.

పల్లెబాటా.. ముళ్లబాటా..!

- పల్లెబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిని నిలదీస్తున్న జనం
- ఏం చేశారని మా గ్రామానికి వస్తున్నారని మండిపాటు
- సొంత పార్టీ నాయకులదీ అదే బాట


కండ్లపల్లిలో ఎమ్మెల్యేను నిలదీస్తున్న జనం

పరిగి: గ్రామాల్లో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేసి, ఎన్ని నిధులు ఖర్చు చేశారనే విషయాలను ఫ్లెక్సీలు వేసి ప్రజలకు తెలియజేసేందుకు స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రెండు నెలలుగా పరిగి, కుల్కచర్ల, చౌడాపూర్, గండీడ్ మండలాల్లో పల్లెబాట పూర్తి చేసుకొని ప్రస్తుతం పూడూర్ మండలంలో కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేకు అన్నీ అడ్డంకులే ఎదురవుతున్నాయి. గ్రామాల పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యేను స్థానిక నాయకులు, ప్రజలు నిలదీస్తున్నారు. గ్రామ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని నిలదీస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు.. నెరవేర్చినవి చెప్పాలని ఎమ్మెల్యేను బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. మరో నాలుగు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎమ్మెల్యేకు ఇలాంటి అనుభవాలు ఎదురవడం పలు చర్చలకు తావిస్తోంది. గులాబీ బాస్ సిట్టింగులైనా.. ఎవరైనా జనాల్లో ఉన్నవారికే టిక్కెట్లు అనడం నాయకుల్లో గుబులు మొదలైంది.

గ్రామానికి రావొద్దని నిరసనలు

ప్రతిరోజూ ఎమ్మెల్యే నాలుగైదు గ్రామాలను ఎంచుకుని పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, ఖర్చు చేసిన నిధుల గుర్తించి ప్రజలకు వివరించే ప్రయత్నం చేయాలన్నది పల్లెబాట ముఖ్య ఉద్దేశం. అయితే అభివృద్ధిపై ప్రజలు నిలదీస్తుండడంతో పల్లెబాట కాస్త ముళ్ల బాటగా మారింది. ఏ గ్రామానికి వెళ్లినా జనాలు తమ సమస్యలు చెబుతూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. పరిగి మండలంలోని రాపోల్, సయ్యాద్‌పల్లి, రూప్‌ఖాన్‌పేట్, ఆయ గిరిజన తండాల్లో ఎమ్మెల్యేను నిలదీశారు. కుల్కచర్ల మండలంలో చెల్లాపూర్, బిందెంగడ్డ తండా, బండవెల్కిచర్ల, చౌడాపూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యేకు చేదు అనుభవమే ఎదురైంది. పూడూర్ మండలం చన్గోముల్, కంకల్, గట్టుపల్లి, మీర్జాపూర్, మన్నేగూడ, కండ్లపల్లి ఇలా ప్రతి చోటా గ్రామస్తులు అడ్డుకుంటున్నారు. మా గ్రామానికి రావొద్దంటూ కండ్లపల్లి వాసులు ఎమ్మెల్యేను అడ్డుకున్నారు. నాలుగున్నరేళ్లు కావస్తున్నా ఇచ్చిన ఏ హామీ నెరవేర్చలేదని మండిపడుతున్నారు. దీంతో గ్రామస్తులపై ఎమ్మెల్యే అనుచరులు, బీఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడుతున్న సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి.

పోలీసు బందోబస్తుతో పల్లెబాట

ఎమ్మెల్యేకు అడుగడుగునా నిరసన సెగలు తగలడంతో పోలీసు బందోబస్తు మధ్య పల్లెబాట కార్యక్రమం కొనసాగుతోందని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. పరిగి మండలం సయ్యాద్‌పల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఒకరికొకరు దాడులు చేసుకున్నారు. పలువురికి గాయాలు కూడా అయ్యాయి. పూడూర్ మండలం కండ్లపల్లి బీఆర్ఎస్ నాయకుడు గ్రామస్తుడిపై దాడి చేయడంతో స్థానికులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. దీంతో ఆ గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను ఊరిలోకి రావద్దని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బీఆర్ఎస్ పూడూర్ మండల మహిళా అధ్యక్షురాలు బాలమణి ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించారు. ప్రతి గ్రామంలో నిరసనలు ఎదురవుతున్నా ఎమ్మెల్యే మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలా పల్లె బాట కార్యక్రమాన్ని కొనసాగిస్తునే ఉన్నారు.

భార్యపై కన్నేశాడని..

మద్యం తాగించి.. బండరాయితో తలపై మోది వ్యక్తి దారుణ హత్య

- పోలీసుల అదుపులో నిందితుడు


శేఖర్(ఫైల్)

దౌల్తాబాద్: తన భార్యపై కన్నేశాడని.. ఒక్కసారి తన మోజు తీర్చాలని అడిగాడనే అనుమానంతో ఓ వ్యక్తిని మద్యం తాగించి బీరు సీసా, బండరాయితో తలపై మోది దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన శనివారం మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సీ శేఖర్(32) హైదరాబాద్‌లో కూలి పనులు చేసుకుంటూ భార్య పిల్లలతో ఉంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన బీ గోపాల్ నగరంలో పనిచేస్తున్నాడు. ఇద్దరిదీ ఒకే గ్రామం కావడంతో కలిసి కూలి పనులు చేసుకునే వారు. దౌల్తాబాద్‌లో వీరి ఇళ్లు పక్కపక్కనే ఉంటాయి. గోపాల్ రెండు నెలల క్రితం, శేఖర్ నాలుగు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. శేఖర్ తన భార్యపై కన్నేశాడని.. ఒక్క సారి మోజు తీర్చాలని అడిగినట్లు గోపాల్‌కు అనుమానం వచ్చింది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం శేఖర్ ఇంటికెళ్లి గోపాల్‌ను బయటకు తీసుకెళ్లాడు. ఇద్దరూ ఓ దాబాలో మద్యం తాగారు. అనంతరం మద్యం బాటిళ్లు తీసుకుని గుముడాల రోడ్డులోని ఓ పొలంలోకి వెళ్లారు. అక్కడ వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగి గొడవ జరిగింది. గోపాల్ బీరు సీసా, బండరాయితో శేఖర్ తలపై మోది అక్కడి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి 10గంటల సమయంలో గోపాల్ ఒక్కడే ఇంటికి రావడంతో శేఖర్ భార్య నా భర్త ఎక్కడ అని ఆరా తీసింది. తనకు తెలియదు అని చెప్పాడు. అనుమానం రావడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గోపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. శేఖర్‌పై తానే దాడి చేసినట్లు ఒప్పుకున్నాడు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. చికిత్స నిమిత్తం కొడంగల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య ఉషం తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బకాయిలు చెల్లించాల్సిందే


ఓంలానాయక్ తండాలో బకాయి చెల్లించాలని రైతును కోరుతున్న సీఈఓ రాజమౌళి

- లేకుంటే భూములను వేలం వేస్తాం
- పీఏసీఎస్ సీఈఓ రాజమౌళి

పెద్దేముల్: రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించకపోతే వారి భూములను వేలం వేయనున్నట్లు తట్టిపల్లి పీఏసీఎస్ సీఈఓ రాజమౌళి హెచ్చరించారు. శనివారం మండలంలోని ఓంలానాయక్ తండా, రచ్చకట్ట తండా, జైరాం తండాతో పాటు పలు గ్రామాలకు వెళ్లి మొండి బకాయి రైతులను కలిశారు. జూన్ నెల చివరి నాటికి బకాయిలు చెల్లించకపోతే ఆగష్టు నెలల్లో భూములను వేయనున్నట్లు తేల్చి చెప్పారు. 2017 - 18 సంవత్సరంలో ఓంలానాయక్ తండాలో ఏడు మంది రైతులు దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారని, ఒక్కరు మాత్రమే చెల్లించారని తెలిపారు. మిగిలిన ఆరు మంది రైతులు సుమారు రూ. 12లక్షల వరకు చెల్లించాల్సి ఉందన్నారు. రచ్చకట్ట తండాలో ఇద్దరు రైతులు రూ.4 లక్షలు, జైరాం తండాలో ముగ్గురు రైతులు రూ.12లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దీర్ఘకాలిక రుణాలు 60శాతం రికవరీ అయితేనే రైతులకు కొత్త రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం 40శాతం మాత్రమే రికవరీ జరిగిందన్నారు. 115 మంది రైతులు రుణాలు తీసుకోగా, 42 మంది మాత్రమే తిరిగి చెల్లించారని వివరించారు. ఇప్పటి వరకు నోటీసులు ఇచ్చామని, ఇకపై భూములను స్వాధీనం చేసుకొని వేలం వేస్తామని తెలిపారు. ఈ ఏడాది రైతులకు కోటి రుపాయల విలువ చేసే ఎరువులు అందజేయనున్నట్లు తెలిపారు.

నేత్రపర్వంగా విగ్రహ ప్రతిష్ఠాపన

తాండూరు రూరల్: మండలంలోని అల్లాపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉత్సవాల చివరి రోజు శనివారం శ్రీ రామలింగేశ్వర స్వామి ప్రాంగణంలో అనంత పద్మానాభ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ తర్వాత విఘ్నేశ్వర, వీరభద్ర స్వామి, నందీశ్వర, నవగ్రహాలు, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పరమాత్మానందగిరి స్వామి, వెంకట చరణ్ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అమర్‌నాథ్‌గౌడ్, విజయ్‌కుమార్, పెద్ద నర్సింలుగౌడ్, బీరప్ప, నర్సిరెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కిషోర్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజు గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, గౌతాపూర్ సర్పంచ్ రాజప్ప గౌడ్ పాల్గొన్నారు.


ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భక్తజనం

రేపు పాఠశాలల బంద్

అనంతగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేటు స్కూళ్లలో అధిక ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నవీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఈవో, ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అనుమతులు లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా బోరు

కలెక్టర్, తహసీల్దార్‌లకు ఫిర్యాదు

ధారూరు: తన పొలంలో వేసిన బోరు పక్కనే మరో రైతు బోరు వేశాడని మండలంలోని గట్టెపల్లికి చెందిన రైతు దేశ్‌ముఖ్ అంజమ్మ శనివారం కలెక్టర్, ధారూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తన పొలం 87/1/అ సర్వే నంబర్ వేసుకున్న బోరుకు 10 మీటర్ల దూరంలోనే మరో రైతు మరాఠి వెంకట్‌రావు బోరు వేశారని ఆమె వాపోయింది. వాల్టా చట్టం నిబంధనలు పాటించకుండా తన బోరు బావి పక్కనే మరో బోరు బావిని తవ్వించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలనీ ఆమె కలెక్టర్‌ను కోరారు.

ఎమ్మెల్సీ దిష్టిబొమ్మ దహనం

కుల్కచర్ల: మీడియా ప్రతినిధిని కులం పేరుతో దూషించడం ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డికి తగదని, ఇది అతని నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ముదిరాజ్ సంఘం మండల నేతలు మైపాల్, శ్రీనివాస్, కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం పేర్కొన్నారు. శనివారం కుల్కచర్లలో, మండల కేంద్రమైన చౌడాపూర్‌లో ఎమ్మెల్సీ తీరుకు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. కుల్కచర్లలో ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ అయి ఉండి కౌశిక్‌రెడ్డి ఒక మీడియా ప్రతినిధిని బూతులు తిట్టడంతో పాటు ముదిరాజ్ కులస్తులను కించపరిచే విధంగా మాట్లాడడం అతని అహంకారానికి నిదర్శనమన్నారు. 24గంటల్లో ముదిరాజ్ జాతికి క్షమాపణలు చెప్పాలని లేకుంటే తగిన బుద్ధి చెబుతామన్నారు. కుల్కచర్లలోని పరిగి - మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పోలిస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కర్ణయ్య, బుగ్గయ్య, రాములు, భగత్‌కుమార్, శ్రీను, మైపాల్, సాయి, చందు, రాజశేఖర్, రవి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: యూ ట్యూబ్ చానల్ కెమెరామెన్ అజయ్ ముదిరాజ్‌పై దాడికి పాల్పడడమే కాకుండా అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌసిక్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ముదిరాజ్ మండల నాయకులు డిమాండు చేశారు. శనివారం ధారూరులోని తాండూర్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచు రాజేశ్వర్ ముదిరాజ్, జిల్లా నాయకుడు అశోక్ ముదిరాజ్, నాయకులు అంజయ్య, తిరుపతయ్య, వెంకటేశ్, చంద్రయ్య, శ్రీనివాస్, నారాయణ, భిక్షపతి, శివ, సుధాకర్, శుఖర్, కృష్ణయ్య పాల్గొన్నారు.


కుల్కచర్ల: చౌడాపూర్‌లో ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

ఉద్యమకారులను కొట్టిచ్చింది సబిత కాదా ?

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

బడంగ్‌పేట్: తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సమయంలో ఉద్యమకారులను కొట్టిచ్చింది సబితారెడ్డి కాదా? అందుకే సబితమ్మను ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రిని చేశారని బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గడప గడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. అందెల పాదయాత్రకు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మద్దతు పలికారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో అందలం ఎక్కిన సబితారెడ్డి మహేశ్వరం నియోజకవర్గం ప్రజలను ఆగం చేసిందన్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలకు బీజేపీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు రమాదేవి, శ్రీధర్‌రెడ్డి, సునిత, శంకర్, మాధురి, ఇంద్రసేన, అమిత, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బడంగ్‌పేటలో అందెల పాదయాత్రకు మద్దతుగా వచ్చిన విశ్వేశ్వర్‌రెడ్డి

పరామర్శ




మీర్‌పేట: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తండ్రి పాపిరెడ్డి ఈ నెల 15న పరమపదించారు. విషయం తెలుసుకున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శనివారం మీర్‌పేట జిల్లెలగూడలోని నర్సింహారెడ్డి నివాసానికి వచ్చి పరామర్శించారు. రేవంత్‌రెడ్డి వెంట మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

జనవాడలో సందడి చేసిన మంగ్లీ

శంకర్‌పల్లి: ప్రముఖ గాయని మంగ్లీ శంకర్‌పల్లి మండలం జనవాడ గ్రామంలో సందడి చేసింది. శనివారం గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో, బంగారు మైసమ్మ, గడీల మైసమ్మ ఆలయం వద్ద మంగ్లీ ఆధ్వర్యంలో తెలంగాణ బోనాల ప్రాముఖ్యతపై పాటను చిత్రీకరించారు. ఈ సందర్భంగా మంగ్లీ నృత్యం చేశారు. మహిళలు బోనాలు తీశారు. షూటింగ్‌ను తిలకించేందుకు జనం భారీగా తరలివచ్చారు.



నృత్యం చేస్తున్న మంగ్లీ తోటి మహిళలు

హడలెత్తిస్తున్న వీధి కుక్కలు


రోడ్డుపై కుక్కల సంచారం

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట పచ్చి కుక్కలు మనుషులపై దాడి చేస్తునే ఉన్నాయి. ప్రధాన రోడ్ల వెంట గుంపులు గుంపులుగా తిరుగుతూ కనిపించిన వారిపై దాడి చేస్తున్నాయి. దీంతో పిల్లలను స్కూల్‌కు పంపడానికి కూడా తల్లిదండ్రులు భయపడి పోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కుక్కల బెడదను అరికట్టాలని పలు కాలనీల ప్రజలు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య



కొత్తూరు: ఓ గుర్తు తెలియని వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌లో శనివారం వెలుగు చూసింది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి నుంచి తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో ఓ మృతదేహం పడి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తిని దుండగులు తలపై రాయితో కొట్టి హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 52 ఏళ్లు, ఒంటిపై ఎరుపు, పచ్చ రంగు షర్టు, పచ్చ రంగు లుంగీ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి


శంకర్‌పల్లి: విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న వాల్మీకి ఫౌండేషన్ సభ్యులు

పద్మశ్రీ అవార్డు గ్రహీత మంజుల అనగాని

శంకర్‌పల్లి: విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని ఏర్పరుచుని దాన్ని సాధించేందుకు శ్రమించాలిన పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మంజుల అనగాని అన్నారు. శనివారం వాల్మీకి ఫౌండేషన్ 15వ వార్షికోత్సవం సందర్భంగా ఆమె అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ఖాదర్ వల్లి కృష్ణప్రియతో కలిసి స్థానిక జెడ్పీహెచ్ఎస్(బాలుర), కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు శానిటరీ ప్యాడ్స్, వేయి మంది విద్యార్థులకు బ్యాగులు, 20 మందికి సైకిళ్లు, పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కాగా పేదల విద్యాభివృద్ధికి వాల్మీకి ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ గణేశ్ వాల్మీకి, ప్రధాన కార్యదర్శి హరికిషన్ వాల్మీకి, సభ్యులు వాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కౌన్సిలర్ శ్వేత, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ మధురవాణి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల సాయం మరువలేనిది

చేవెళ్ల: పేద విద్యార్థులకు సాయం అందించేందుకు దాతలు ముందుకురావాలని గంగిడి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని గుండాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేశ్, జంగయ్య, రాజశేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సందీప్, సురేశ్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల బలోపేతానికే గొర్రెల పంపిణీ


మేడిపల్లిలో గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మొయినాబాద్: రెండు విడతలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 30,090 యూనిట్ల గొర్రెలు పంపిణీ చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని మేడిపల్లిలో శనివారం గొల్ల కురుమలకు 12 యూనిట్ల గొర్రెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గొల్ల కురుమలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించిందన్నారు. జిల్లాలో ఇప్పటికే మొదటి విడతలో 11,623 యూనిట్ల గొర్రెలు పంపిణీ చేశామన్నారు. గొర్రెలు తీసుకున్న గొల్లకురుమలు గొర్రెల ఉత్పత్తి చేసే స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మమత, సర్పంచ్‌లు ప్రవీణ్‌కుమార్, రత్నం, కుమార్, ఎంపీటీసీ సభ్యులు అంజయ్య, శ్రీనివాస్, మల్లేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్, నాయకులు జయవంత్, సుధాకర్ యాదవ్, మల్లేశ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.